
సాక్షి అనకాపల్లి

బుధవారం : 19 : ఫిబ్రవరి : 2025



పోక్సో కేసుల్లో రాజీ వద్దు

ఆరిలోవ: పోక్సో కేసుల్లో రాజీ కుదర్చరాదని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ తెలిపారు. న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు.



అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: విశాఖ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపు ష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.



కుంభమేళాకు ఆర్టీసీ సర్వీస్

డాబాగార్డెన్స్: విశాఖ ద్వారకా బస్ స్టేషన్ నుంచి కుంభమేళా (ప్రయోగరాజ్)కు మంగళవారం ఆర్టీసీ సర్వీస్ బయలుదేరి వెళ్లింది.

న్యూస్‌రీల్

ఫార్మర్ రిజిస్ట్రీని తనిఖీ చేసిన కలెక్టర్



ఫార్మర్ రిజిస్ట్రీ గురించి రైతుకు వివరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

కె.కోటపాడు: రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. మేడిచర్ల గ్రామంలో మంగళవారం సాయంత్రం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా రైతు రొంగలి దేముడుకు చెందిన పంట వివరాలను వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బంది ఈ–పంటలో నమోదు చేశారు. ఆ వివరాలను సూపర్ చెక్‌లో భాగంగా ఆమె తనిఖీ చేశారు. మినుము పంట వేసిన రైతు దేముడు వివరాలు సరిపోవడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. సాగులో ఉన్న పిల్లిపెసర, జనుము పంటల గురించి కలెక్టర్ జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావును అడిగి తెలుసుకున్నారు. రైతులకు వ్యవసాయశాఖ ద్వారా అందించే రాయితీ, పంట పెట్టుబడి, దిగుబడి గురించి ఆరా తీశారు. తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీవో సాంబశివరావు, మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, ఏపీవో అప్పలరాజు, ఏఈవో లైలాదేవి తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాతో అద్భుతాలు

- యువతకు మార్గనిర్దేశం
- వివిధ వర్గాలకు అవగాహన
- ఎస్పీ తుహిన్ సిన్హా పిలుపు



సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: సమాజాన్ని సురక్షితంగా, చట్టపరంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని, సోషల్ మీడియాను ఉపయోగించి యువతను సరైన దిశలో నడిపించేందుకు కృషి చేయాలని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో సమావేశం నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగం నివారణ, గుడ్ టచ్–బ్యాడ్ టచ్, మహిళలు బాలల హక్కులు, రోడ్డు భద్రతా నియమాలు, సైబర్ నేరాలపై విస్తృతంగా సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. పోలీస్ శాఖ సహకారంతో ఇన్‌ఫ్లుయెన్సర్లు కీలక భూమిక పోషించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు, ట్రెయినీ డీఎస్పీ ఎం.వి.కృష్ణ చైతన్య, ఐటీ కోర్ ఎస్‌ఐ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.


మహిళా స్టేషన్ తనిఖీ

పట్టణంలోని మహిళా పోలీస్ స్టేషన్‌ను మంగళవారం రాత్రి ఎస్పీ తుహిన్ సిన్హా పరిశీలించారు. మహిళలు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, రక్షణకు భద్రత చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. అనంతరం ఎన్టీఆర్ ఆస్పత్రిలో డి–అడిక్షన్ సెంటర్‌ను సందర్శించారు. సెంటర్‌లో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితి, చికిత్సా విధానాల గురించి వైద్యుడు కృష్ణ చైతన్యతో మాట్లాడారు.

ఆర్గనైజ్ క్రైం కేసులో ఇద్దరు తైవాన్ వాసుల అరెస్ట్

అల్లిపురం (విశాఖ): వ్యవస్థీకృత(ఆర్గనైజ్) క్రైం కేసులో ఇద్దరు తైవాన్ వాసులను సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం మీడియాకు తెలిపిన వివరాలు.. గత ఏడాది అక్టోబర్ 16న ఇల్లీగల్ పేమెంట్ గేట్‌వే కేసు విచారణలో భాగంగా తైవాన్ జాతీయులైన ము–చి కోనియన్ సేంగ్ అలియాస్ సంగ్ ము–చి అలియాస్ మార్క్, హా–యున్ చాంగ్ అలియాస్ చాంగ్ హోహో–యున్ అలియాస్ మార్కోలు నగరంలోని రాడిసన్ బ్లూ రిసార్ట్స్, సేస్‌ప్రా బే వ్యూ హోటల్‌లో బసచేసి అమాయకులను ఆకర్షించి, వారికి సైబర్ నేరాల్లో శిక్షణ అందించేవారు. దేశంలోని వివిధ వ్యక్తుల సాయంతో పేద, వ్యసనాలకు బానిసలైన వ్యక్తులకు డబ్బు ఆశ చూపి వివిధ బ్యాంకుల్లో సేవింగ్, కరెంట్ ఖాతాలను తెరిచేవారు. వివిధ రకాల మొబైల్ నెట్‌వర్కులకు సంబంధించిన సిమ్‌కార్డులను తీసుకుని, దేశంలో వివిధ ప్రాంతాలలో మకాం వేసి రూ.కోట్ల లావాదేవీలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ అజిత వేజెండ్ల సహకారంతో మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇప్పటి వరకు ఇద్దరు విదేశీ నిందితులు, ఒక అంతర్ జిల్లా ముద్దాయి తోపాటు 26 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు సీపీ వెల్లడించారు.

వైభవం.. రామచంద్రమ్మ ఉత్సవం



పరవాడ మండలం వాడచీపురుపల్లి గ్రామ ప్రజల ఆరాధ్యదైవం రామచంద్రమ్మ పండగ మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారిని పూజించారు. అనకాపల్లి, విశాఖ జిల్లాల నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. వేకువ జాము నుంచే అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. –పరవాడ

ఎమ్మెల్సీ ఎన్నికకు నిధుల సంకటం



- ఎన్నికల నిర్వహణకు రూ.3 కోట్ల వరకు ఖర్చు?
- పోలింగ్ తేదీ దగ్గర పడుతున్నా విడుదల కాని నిధులు
- ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్న జిల్లా యంత్రాంగం



మహారాణిపేట (విశాఖ): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎన్నికల తేదీ దగ్గర పడుతోంది. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం గానీ, ఎన్నికల కమిషన్ గానీ పైసా కూడా విదిల్చలేదు. మరోవైపు ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని మాత్రం అధికారులకు ఆదేశాలు జారీ చేస్తుండడం గమనార్హం. దీంతో జిల్లా అధికారులు ప్రత్యామ్నాయ నిధులను ఎన్నికల నిర్వహణకు ఖర్చు చేస్తున్నారు. ఈ నెల 27న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 25వ తేదీ సాయంత్రంతో అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ముగియనుంది. 27వ తేదీన పోలింగ్, వచ్చే నెల 3వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. ఇప్పటికే కర్నూలు ప్రభుత్వ ముద్రణ శాలలో పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ పత్రాల ప్రింటింగ్ ప్రక్రియ పూర్తవడంతో అవి విశాఖకు చేరుకున్నాయి. వాటిని ఇక్కడి నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు పంపించారు. వాస్తవానికి ఈ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నిధులు సమకూర్చాల్సి ఉంటుంది. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు ఎటువంటి నిధులు విడుదల చేయలేదు. దీంతో జిల్లా అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర ఫండ్స్ నుంచి నిధులను మళ్లించి ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి నిధులు రాని పక్షంలో మళ్లీ వాటిని సర్దుబాటు చేయడం అధికారులకు తలనొప్పిగా మారే అవకాశముంది.

21,555 మంది ఓటర్లు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయల ఎన్నికల్లో 21,555 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 12,948 మంది పురుషులు, 8,607 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. శ్రీకాకుళం జిల్లాలో 4,829 మంది, విజయనగరంలో 4,937, మన్యం పార్వతీపురం మన్యంలో 2,262, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,448, విశాఖలో 5,277, అనకాపల్లి జిల్లాలో 2802 మంది ఓటర్లు ఉన్నారు.

ఎన్నికల ఖర్చు రూ.3 కోట్లు!

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఎన్నికల ప్రధాన అధికారిగా వ్యవహరిస్తున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం రూ.3 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. 123 పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లకు నిధులు అవసరం. పోలింగ్ సిబ్బంది భోజనాలు, పోలింగ్ తర్వాత టీఏ, డీఏలు కూడా చెల్లించాల్సి ఉంది.

ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఓటర్ల కోసం టెంట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల సామగ్రి కొనుగోలు, ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు, తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. తొలి విడతగా ఎన్నికల నిర్వహణపై మంగళవారం సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మళ్లీ ఈ నెల 24న మరోసారి శిక్షణ ఇవ్వనున్నారు. మార్చి 3న ఆంధ్రా యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటికి కూడా నిధులు అవసరం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అధికారులు నానా తంటాలు పడుతున్నారు.

వీసీ పీఠంపై ఐఐటీ ప్రొఫెసర్

- స్థానికుడికే దక్కిన అవకాశం
- ఏయూ ఉపకులపతిగా ఆచార్య రాజశేఖర్ నియామకం
- వర్సిటీలోని ఇద్దరు ఆచార్యులకు వీసీలుగా అవకాశం
- నన్నయ వర్సిటీకి ప్రసన్న శ్రీ. కృష్ణా వర్సిటీకి రాంజీ నియామకం



ఉద్యోగ ప్రస్థానం

- 1997లో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో గెస్ట్ ఫ్యాకల్టీగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభం
- 1998 నుంచి 2000 డిసెంబర్ వరకు జపాన్‌లోని టోక్యో యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్ ఫెలోగా పని చేశారు.
- 2000 డిసెంబర్ నుంచి 2002 జూన్ వరకు ఐఐటీ ఖరగ్‌పూర్‌లో విజిటింగ్ ఫ్యాకల్టీగా సేవలందించారు.
- 2002 జూన్ నుంచి 2007 ఏప్రిల్ వరకు అక్కడే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు.
- అనంతరం సెలవులో ఉండి వివిధ అంశాలపై పరిశోధనలు చేశారు.
- 2011 నుంచి 2019 వరకు ఖరగ్‌పూర్ ఐఐటీలోనే ప్రొఫెసర్‌గా పనిచేశారు.
- 2019 ఆగస్టు నుంచి హెచ్‌ఏజీ స్కేల్‌తో అదే చోట ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.
- అలాగే ప్రొఫెసర్ రాజశేఖర్ ఖరగ్‌పూర్ ఐఐటీ డీన్‌గా, జేఈఈ మెయిన్స్‌ను ఐఐటీ ఖరగ్‌పూర్ నిర్వహించినప్పుడు చైర్మన్‌గా వ్యవహరించారు.

విశాఖ విద్య/సింహాచలం: ఆంధ్ర యూనివర్సిటీ ఉపకులపతిగా ఆచార్య గంగవంశం పైడి రాజశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోన శశిధర్ సంయుక్తంగా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య రాజశేఖర్ ప్రస్తుతం ఖరగ్‌పూర్ ఐఐటీలో మ్యాథ్స్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా.. ఆచార్య రాజశేఖర్‌ది సింహాచలం. తమ ప్రాంతీయుడు ఏయూ వీసీగా నియామకం కావడం ఎంతో గర్వకారణమని రాజశేఖర్ స్నేహితులు, సన్నిహితులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. రాజశేఖర్ అడవివరం ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుంచి 7వ తరగతి వరకు చదువుకున్నారు. గ్రీన్‌పార్క్ సమీపంలోని సెయింట్ ఆంథోనీ స్కూల్‌లో 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం చేశారు. ఏవీఎన్ కళాశాలలో ఇంటర్మీడియట్(ఎంపీసీ), డిగ్రీ(బీఎస్సీ) పూర్తి చేశారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎంఎస్సీ, ఎంఫిల్ పూర్తి చేసి అదే యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. గణితంలో ఆచార్య రాజశేఖర్ చేసిన పరిశోధనలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయి.

కుటుంబ నేపథ్యం

ప్రొఫెసర్ రాజశేఖర్ తండ్రి బలరామకృష్ణ అడవివరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. తల్లి సావిత్రి గృహిణి. రాజశేఖర్ సోదరుడు గిరిధర్ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్నారు. రాజశేఖర్ కుమార్తె కూడా ఖరగ్‌పూర్ ఐఐటీలో విద్యనభ్యస్తున్నారు. 2017లో అడవివరంలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాల్లో స్థానికులు రాజశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. రాజశేఖర్ ఏయూ వీసీగా నియామకం కావడంతో అతని స్నేహితులు పాశర్ల ప్రసాద్, టి.వి.కృష్ణంరాజు, రాజనాల సత్యారావు, వై.డి.వి ప్రసాద్, గ్రామస్తులు కర్రి అప్పలస్వామి, కొలుసు ఈశ్వరరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వీసీ శశిభూషణరావు రిలీవ్

ఏయూ ఇన్‌చార్జి వీసీ బాధ్యతల నుంచి ఆచార్య జి.శశిభూషణరావు మంగళవారం రిలీవ్ అయ్యారు. వర్సిటీకి నూతన వీసీని నియమించడం, ప్రస్తుత వీసీ వెంటనే రిలీవ్ కావాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు శశిభూషణరావు వీసీ బాధ్యతల నుంచి వైదొలగి.. తన మాతృస్థానమైన వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా వెళ్లారు. దీంతో రిజిస్ట్రార్ ధనుంజయరావు పూర్తి స్థాయిలో వర్సిటీ కార్యకలాపాలపై పర్యవేక్షణ చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఇద్దరు ఆచార్యులకు వీసీలుగా అవకాశం

ఆంధ్ర యూనివర్సిటీలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఆచార్యులను రాష్ట్రంలోని వేర్వేరు వర్సిటీలకు వైస్ చాన్సలర్లుగా ప్రభుత్వం నియమించింది. వర్సిటీ విద్యా విభాగంలో పనిచేస్తున్న ఆచార్య కూన రాంజీని మచిలీపట్నం కేంద్రంగా ఉన్న కృష్ణా యూనివర్సిటీకి, ఇంగ్లిష్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ప్రసన్నశ్రీను రాజమండ్రిలోని నన్నయ యూనివర్సిటీకి వీసీలుగా నియమించింది. ఆంధ్ర యూనివర్సిటీ నుంచే ఇద్దరు ఆచార్యులకు వీసీలుగా అవకాశం దక్కడం విశేషం.

ప్రస్తుత వీసీకి ఆశాభంగం

ప్రస్తుత ఇన్‌చార్జి వీసీ శశిభూషణరావుకు ఆంధ్ర యూనివర్సిటీలో పూర్తిస్థాయి వీసీగా అవకాశం కల్పిస్తారనే ప్రచారం జరిగింది. మరోపక్క వీసీ పోస్ట్ కోసమని ప్రస్తుత రిజిస్ట్రార్ ఎన్.ధనుంజయరావు, రెక్టార్ కిశోర్‌బాబు తమ స్థాయిలో లాబీయింగ్ చేశారు. కానీ వీరికి అవకాశం దక్కలేదు. వర్సిటీలో కీలక పోస్టుల్లో ఉన్న వీరిని ఇక్కడ కాకుంటే, రాష్ట్రంలోని ఇతర యూనివర్సిటీలకైనా పరిగణలోకి తీసుకుంటారని అంతా భావించారు. కూటమికి చెందిన కీలక నేతలు వీరికి అభయం కూడా ఇచ్చారనే ప్రచారం సాగింది. కానీ ప్రభుత్వం నుంచి వీరికి ఆశాభంగం తప్పలేదు.

జల దృక్పథానికి జేజేలు

- 'చెట్టుపల్లి' విద్యార్థుల నమూనాకు ప్రాంతీయ అవార్డు



విద్యా శాఖ కమిషనర్ విజయరామరాజు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

నర్సీపట్నం: సీపీఆర్ పర్యావరణ విద్యా కేంద్రం చెన్నై, విప్రో సంస్థ సంయుక్తంగా జాతీయస్థాయిలో నిర్వహించిన 'సుస్థిర జీవన విధానం' పోటీలో నర్సీపట్నం మండలం, చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన జల దృక్పథం నమూనా ప్రాంతీయ అవార్డు సాధించింది. నిర్వాహకులు సూచించిన సుస్థిరత–నీరు, సుస్థిరత–వ్యర్థాల నిర్వహణ, సుస్థిరత జీవవైవిధ్యం అంశాలపై తొమ్మితో తరగతి విద్యార్థిలు వెలంకాయల సాయి శివాని, పండూరి మనోజ్ కుమార్, మోక్ష మాధురి కౌశిక్ బృందం జల దృక్పథం నమూనాను రూపొందించింది. మంగళవారం అమరావతిలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, పాఠశాల విద్య అకడమిక్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి చేతుల మీదుగా విద్యార్థులు, వారికి మార్గదర్శిగా వ్యవహరించిన ఉపాధ్యాయుడు రాజగోపాల్ ప్రశంసా పత్రం, నగదు బహుమతి అందుకున్నారు. విద్యార్థి దశ నుంచి పర్యావరణం పట్ల ఆసక్తి పెంచే కార్యక్రమాలు భవిష్యత్తు అవసరాలకు బాగా ఉపయోగపడతాయని విద్యార్థులకు దిశ నిర్దేశం చేసినట్లు ఉపాధ్యాయులు రాజగోపాల్ తెలిపారు.

జల దృక్పథం నమూనా నీటి కొరతను నివారించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. 10 వేల లీటర్ల వరకు భారీ స్థాయిలో నీటిని వినియోగించే జనావాసాలు, అపార్ట్‌మెంట్లలో.. మురుగునీటిని మంచి నీటిగా శుభ్రపరిచే ప్రక్రియను రూ.85 వేల వ్యయంతో జల దృక్పథం కాన్సెప్ట్‌తో చేపట్టవచ్చని తెలిపారు.

అల్లరి చేష్టలతో భవిష్యత్తు నాశనం



గిరిజన సంక్షేమ బాలికల హాస్టల్లో విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ జివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్

- ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ చట్టరీత్యా నేరం
- విద్యార్థినులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలి
- సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్

నర్సీపట్నం: ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడడం చట్టరీత్యా నేరమని, అలా చేసిన వారు శిక్షార్హులని సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు కాలేజీలు, పాఠశాలల్లో టౌన్ పోలీసులు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో జడ్జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలేజీలు, పాఠశాలలు వదిలే సమయాల్లో ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడరాదన్నారు. ఎవరి వల్లనైనా ఇబ్బంది కలిగితే విద్యార్థినులు వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలన్నారు. బాలికల భద్రతకు పోక్సో చట్టం తీసుకువచ్చారని, పోక్సో కేసులో ఇరుక్కుంటే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతంగా స్థిరపడి కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. అల్లరి మూకల వల్ల ఇబ్బందులు తలెత్తితే నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయన్నారు. ఈ అవగాహన సదస్సుల్లో సీఐ గోవిందరావు, ఎస్సైలు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో వ్యవసాయ రంగం



సదస్సులో మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

- జస్టిస్ స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయడమే పరిష్కారం
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి

అనకాపల్లి టౌన్: వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలంటే జస్టిస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాల్సిందేనని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి తెలిపారు. స్థానిక వై.విజయ్‌కుమార్ హాల్‌లో మంగళవారం మాజీ శాసనసభ్యుడు కోడుగంటి గోవిందరావు 11వ వర్ధంతి సందర్భంగా 'వ్యవసాయరంగం–పెనుసవాళ్లు' అనే అంశంపై జిల్లా స్థాయి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయరంగం ప్రపంచవ్యాప్తంగా సంక్షోభంలో పడిందని, ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ రైతు సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. సరళీకృత ఆర్థిక విధానాల వలన పారిశ్రామికీకరణ వలన వ్యవసాయ రంగం దెబ్బతిన్నదని, పారిశ్రామిక, రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం భూమిని వాడుకోవడం వలన వ్యవసాయ భూమి కనుమరుగైపోతుందన్నారు. వ్యవసాయ రంగానికి గోవిందరావు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు, మాకిరెడ్డి రామునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్యాసిరావు, రెడ్డిపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సమర్థంగా ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ

- పీవోలు, ఏపీవోలు పారదర్శకంగా ఉండాలి
- నిబంధనలను కచ్చితంగా పాటించాలి
- తొలి విడత శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ కృష్ణన్



పోలింగ్‌పై తొలివిడత శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. ఈనెల 27న జరగనున్న పోలింగ్ ప్రక్రియపై ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు తొలి విడత శిక్షణ తరగతులను మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీవోలు, ఏపీవోలు పూర్తి పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ ప్రక్రియలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. సాధారణ ఎన్నికలకు భిన్నంగా బ్యాలెట్ పద్ధతిన జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహణలో వ్యవధి ఎక్కువగా పట్టే అవకాశం ఉన్నందున ఓపిగ్గా, సంయమనం పాటిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. చిన్నపాటి తప్పిదానికి కూడా తావు లేకుండా పోలింగ్ ప్రక్రియ జరిగేలా విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్ ప్రక్రియ బాధ్యత మొత్తం ప్రిసైడింగ్ అధికారిదేనని, బ్యాలెట్ బాక్సులు తీసుకున్న రోజు నుంచి పోలింగ్ ముగిసి తిరిగి అప్పగించే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమావళి ప్రకారంగా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పక్కాగా విధులు నిర్వహించాలన్నారు. ఓటు వేయడానికి ఎన్నికల కమిషన్ అందజేసిన పెన్ను మాత్రమే వినియోగించాలన్నారు.

జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, ట్రైనింగ్ ప్రోగ్రాం అధికారులు డీపీఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ పి.జయంతి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ ఎస్.వి.ఎస్.ఎస్.నాయుడు, డిప్యూటీ తహసీల్దార్ పి.అరుణచంద్ర ఎన్నికల నిబంధనలు, పోలింగ్ విధానం, బ్యాలెట్ బాక్సుల నిర్వహణపై శిక్షణ అందించారు.

క్లుప్తంగా

బంగారం చోరీ కేసులో నిందితుడికి రిమాండ్



మాట్లాడుతున్న రూరల్ సీఐ అశోక్‌కుమార్

అనకాపల్లి: దొంగతనం కేసులో తప్పించుకుని తిరుగుతున్న మండలంలో మాకవరం గ్రామానికి చెందిన గంజి మంగరావును మండలంలో మార్టూరు జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్ మంగళవారం తెలిపారు. మండలంలో పెదమాకవరం గ్రామానికి చెందిన దాసరి నారాయణరావు ఇంట్లో ఈ నెల 13న రెండు తులాలు బంగారం చోరీకి గురైనట్లు అతడి మనవరాలు కరణం రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడిని పట్టుకుని తులమున్నర బంగారంతోపాటు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలో చోరీ చేసిన బైక్(యూనీకాన్ బైక్)ను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ రవికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

- యువకుడి మృతి


అచ్యుతాపురం రూరల్: మండలంలోని మడుతూరు కూడలికి కూతవేటు దూరంలో గాజువాక వెళ్లే రహదారిలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో వాకపల్లి రమేష్ (19) యువకుడు మృతి చెందినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం మృతుడు రమేష్ గాజువాక రహదారిలో వెళ్తుండగా ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేస్తుండగా మరో ద్విచక్ర వాహనం ఎదురుగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అచ్యుతాపురం వైపు వస్తున్న మరో ద్విచక్ర వాహనదారు కాలు విరిగింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

24న సర్టిఫికెట్ కోర్సులకు ఇంటర్వ్యూ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్)లో స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 24న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. ఏడాది వ్యవధి కలిగిన పారిశ్రామిక భద్రత కోర్సులో 60 సీట్లు, 6 నెలల వ్యవధితో ఫైర్ సేఫ్టీ కోర్సులో 30 సీట్లు, 4 నెలల వ్యవధితో ఆఫీస్ ఆటోమేషన్ కోర్సులో 20 సీట్లు, 3 నెలల వ్యవధితో కెమికల్ సూపర్‌వైజరీ ప్రోగ్రామ్‌లో 20 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్నవారు టెన్త్ పాస్/డిప్లొమా/ఇంటర్/డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్, రెండేళ్ల పారిశ్రామిక అనుభవ ధ్రువీకరణపత్రం ఒరిజినల్‌తో పాటు ఒక సెట్ జెరాక్స్‌తో ఆ రోజు ఉదయం 10గంటలకు హాజరు కావాలన్నారు.

కొబ్బరి రైతుకు భీమా

- కొబ్బరి చెట్లకు బీమా పథకం
- ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతే పరిహారం
- ఉద్యానవన అధికారి భాను పుష్పలీలావతి





మాడుగుల రూరల్: రైతుల కోసం ఎన్నో పథకాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. వాటిపై అవగాహన లేకపోవడం, క్షేత్రస్థాయిలో సరైన ప్రచారం లేకపోవడంతో ఇప్పటికీ చాలామంది ప్రభుత్వ ఫలాలు పొందలేకపోతున్నారు. పర్యవసానంగా ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా(ఎ.ఐ.సి) అనే కేంద్ర ప్రభుత్వ రంగ బీమా సంస్థ, కొబ్బరి అభివృద్ధి బోర్డు(సీడీబీ), రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో కొబ్బరి చెట్లకు కలిగిన నష్టం వల్ల వచ్చే ఆర్థిక ఇబ్బందులు నుంచి రైతులను ఆదుకునేందుకు కొబ్బరి చెట్ల బీమా పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఈ మేరకు కొబ్బరి చెట్ల బీమా పథకం(సి.పి.ఐ.ఎస్) ద్వారా కొబ్బరి రైతులు ప్రీమియం చెల్లించాలని మండల ఉద్యానవన శాఖాధికారి వి. భాను పుష్పలీలావతి పేర్కొన్నారు. దీనివల్ల పొందే ప్రయోజనాలు గురించి సాక్షికి ఆమె వివరించారు.

బీమాకు వర్తించే కొబ్బరి చెట్లు...

టాల్, హైబ్రిడ్, డ్వార్ఫ్ రకాలకు చెందిన కొబ్బరి చెట్లకు కింద పేర్కొన్న సంవత్సర మధ్యలో ఉంటే బీమా వర్తిస్తుంది. డ్వార్ఫ్, హైబ్రిడ్ కొబ్బరి చెట్లు 4 నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. టాల్ చెట్లు 7 నుంచి 60 సంవత్సరాల వరకు వయసు చెట్లుకు బీమా ప్రీమియం చెల్లించవచ్చు. ఏ రైతు స్థలంలోనైనా కనీసం ఐదు ఆరోగ్యకరమైన చెట్లు ఉంటే బీమాకు అర్హులు.

నష్టపరిహారం వర్తించే అంశాలు...

తుఫాన్, వడగండ్ల వాన, సుడిగాలి, భారీ వర్షాలు, వరద ముప్పు, చీడపీడలు వల్ల చెట్లుకు నష్టం జరుగుట. ప్రమాదవశాత్తు అగ్ని లేదా మెరుపులుతో కూడిన మంటలు, భూకంపం, కొండచరియలు విరిగిపడటం, సునామీ, తీవ్ర కరువు, చెట్టు మొత్తం నష్టపోవడం వంటి వాటికి ఈ బీమా వర్తిస్తుంది.

బీమాలో సబ్సిడీ...

బీమా ప్రీమియంలో సబ్సిడీ కూడా ఉంటుంది. ప్రీమియంలో 50 శాతం కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు, 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. మిగిలిన 25 శాతం మాత్రమే రైతు చెల్లించాలి. రైతులు రెండు సంవత్సరాలు బీమాకు ప్రీమియంలో 7.5 శాతం రాయితీ, మూడు సంవత్సరాలు బీమాకు 12.5 శాతం రాయితీ వర్తిస్తుంది. మూడు సంవత్సరాలు కాలపరిమితికి బీమా చేసుకోవచ్చు. ఒక చెట్టుకు మూడు సంవత్సరాలకు ప్రీమియం రూ. 27.65 అయితే, సబ్సిడీ పోను రూ. 5.90 పైసలు (నాలుగు నుంచి 15 సంవత్సరాల వయస్సు కలిగిన చెట్లు), 16 నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగిన ఒక చెట్టుకు మూడు సంవత్సరాలకు రూ. 40.69 పైసలు చెల్లించాల్సి ఉండగా, రైతు ప్రీమియం రూ.9.19 పైసలు చెల్లించాలి. పూర్తి వివరాలు కోసం తమ సమీపంలో రైతు సేవా కేంద్రంలో వీఏఏ లేదా వీహెచ్ఏలను సంప్రదించాలి.

ఏయూలో పేలవంగా వజ్రోత్సవాలు



హాజరైన ఆచార్యులు, అతిథులు



ప్రసంగిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ జియో ఫిజిక్స్ విభాగం వజ్రోత్సవాలు పేలవంగా సాగుతున్నాయి. వర్సిటీలో జియో ఫిజిక్స్ విభాగం ఏర్పాటై 75 ఏళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో మూడు రోజుల పాటు ప్లాటినం జూబ్లీ ఉత్సవాల నిర్వహణకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. మొదటి రోజు ప్రారంభ వేడుక డాక్టర్ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో అట్టహాసంగా జరిగింది. రెండో రోజు మంగళవారం ఈ కార్యక్రమాన్ని వర్సిటీలోని జియో ఫిజిక్స్ బ్లాక్‌కు మార్చారు. రెండు హాళ్లలో సెమినార్లు కొనసాగేలా షెడ్యూల్ ఇచ్చారు. ఉపన్యాసాలు ఇచ్చే వారికి, ఆహూతులకు తగిన ఏర్పాట్లు చేశారు. అయితే ఒక హాల్లో మాత్రమే సెమినార్ నిర్వహించగా, రెండో హాల్ నిరుపయోగంగా వదిలేశారు. రెండో హాల్లో సెమినార్ ఇవ్వాల్సిన పలువురు విద్యావేత్తలు, విషయం తెలియక అక్కడే చాలా సేపు కూర్చున్నారు. మధ్యాహ్నం వరకు ఒకే హాల్లో సెమినార్ కొనసాగగా, దానికి కూడా పూర్తి స్థాయిలో ఆహూతులు లేక కుర్చీలు ఖాళీగానే కనిపించాయి. సబ్జెక్టు పరంగా ఎంతో నిష్ణాతులైన వారు తమ అభిప్రాయాలు, అనుభవాలను పంచుకునే సమయంలో, వీటిని సద్వినియోగం చేసుకునే రీతిలో విద్యార్థులనైనా భాగస్వాములను చేయకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. విభాగం భవనం ముందు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మధ్యాహ్నం వరకు 58 మంది మాత్రమే సందర్శించారు. మధ్యాహ్నం తరువాత ఏవీఎన్ కాలేజీ విద్యార్థులు తిలకించేందుకు వచ్చారు. ఆంధ్ర యూనివర్సిటీ వందేళ్ల ఉత్సవాలు త్వరలోనే జరగనున్నాయి. ఓ విభాగం నిర్వహించే వజ్రోత్సవాలే ఇలా ఉంటే.. వర్సిటీ వందేళ్ల ఉత్సవాలు ఇంకెలా చేస్తారోనని ఆచార్యులు సైతం పెదవి విరుస్తున్నారు.

మురిసేలా మిరియం

- విరగ్గాసిన కాపు
- సేకరణలో రైతులు బిజీబిజీ
- కాఫీతోటల్లో అంతరపంటగా సాగు
- 1.10లక్షల ఎకరాల్లో మిరియాల పాదులు
- గత ఏడాది 11వేల టన్నుల వ్యాపారం
- ఎకరానికి రూ.60వేల ఆదాయం



ఎండు మిరియాలు



మోదాపల్లిలో విరగ్గాసిన మిరియాలు



గుర్ర గరువులో మిరియాలు సేకరిస్తున్న గిరిజనులు

సాక్షి,పాడేరు: జిల్లాలో కాఫీ తోటల్లో అంతరపంటగా గిరిజన రైతులు సాగుచేస్తున్న మిరియాల పంట విరగ్గాసింది. పాదులకు అధికంగా మిరియాల కాపు ఉండడంతో గిరిజన రైతులు మురిసిపోతున్నారు.నాణ్యతలో నంబర్-1గా జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న మన్యం మిరియాలు ఈఏడాది కూడా గిరిజన రైతులకు అధిక లాభాలు అందించనున్నాయి. కేరళ, కర్నాటక,తమిళనాడు,ఒడిశా రాష్ట్రాలలో మిరియాల పంట ఉన్నప్పటికీ అల్లూరి జిల్లాలో గిరిజనులు సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న మిరియాలే నాణ్యతలో నంబర్ వన్‌గా నిలుస్తున్నాయి. ఘాటు అధికంగా ఉండే మన్యం మిరియాలకు జాతీయ మార్కెట్‌లో మంచి ఆదరణ ఉంది. గత ఏడాది కిలో రూ.600 నుంచి రూ.700ధరతో వ్యాపారులు కొనుగోలు చేశారు.

1.10లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో 1.48 లక్షల ఎకరాల్లో ఫలసాయం ఇచ్చే కాఫీతోటలను గిరిజనులు సాగు చేస్తున్నారు. వాటిలో 1.10 లక్షల ఎకరాల్లో మిరియాల పాదులను అంతరపంటగా వేశారు.ఎకరానికి తక్కువలో చూసుకున్న 100 కిలోల ఎండు మిరియాలను రైతులు మార్కెటింగ్ చేస్తారు. ఎకరానికి రూ.60వేల నుంచి రూ.70వేల వరకు ఆదాయం లభిస్తుంది.గత ఏడాది 11వేల టన్నుల వరకు దిగుబడి వచ్చింది.ప్రైవేట్ వ్యాపారులు పోటాపోటీగా కొనుగోలు చేశారు. ఈ ఏడాది కూడా వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో మిరియాల పాదులకు కాపు విరగ్గాసింది. దిగుబడులు మరింత పెరిగి కనీసం 12వేల టన్నుల వరకు మార్కెట్ జరుగుతుందని ఉద్యానవన,కాఫీబోర్డు, స్పైసెస్ బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు.

మిరియాల సేకరణ ప్రారంభం

మన్యంలో మిరియాల పంట దిగుబడి దశకు రావడంతో గిరిజన రైతులు పాదులకు ఉన్న గింజల సేకరణను ప్రారంభించారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్పైసెస్ బోర్డు,పాడేరు ఐటీడీఏలు అల్యూమినియం నిచ్చెనలను పంపిణీ చేయడంతో గిరిజన రైతులకు ఎంతో మేలు జరిగింది.వాటితోనే మిరియాలను సేకరిస్తున్న గిరిజన రైతులు వెనువెంటనే వేడినీళ్లలో నానబెట్టి ఎండు మిరియాలను తయారు చేస్తున్నారు.గింజల్లో తేమ పూర్తిగా పోయిన తరువాత గిరిజన రైతులు సంతల్లో అమ్మకాలు చేపడుతున్నారు.

కిలో రూ.550 ధరతో కొనుగోళ్లు ప్రారంభం

జిల్లాలో మిరియాల వ్యాపారం ప్రారంభమైంది. ప్రారంభ దశ కావడంతో వ్యాపారులు కిలో రూ.550ధరతో కొనుగోలు చేస్తున్నారు.ఈ ఏడాది కూడా మన్యం మిరియాలకు డిమాండ్ అధికంగా ఉందని పెద్ద వ్యాపారులు చెబుతున్న నేపథ్యంలో వచ్చే వారం నుంచి ధరలు పెంచి వ్యాపారులు పోటాపోటీగా కొనుగోలు చేసే అవకాశం ఉంది. అయితే కాఫీ పంట వలే మిరియాలను కూడా జీసీసీ,పాడేరు ఐటీడీఏలు కొనుగోలు చేయాలని గిరిజన రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సరియాపల్లిలో 20 మందికి అస్వస్థత

- వాంతులు, విరోచనాలతో ఒకే రోజు ఇద్దరి మృతి
- భయాందోళనలో గ్రామస్తులు
- ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



సరియాపల్లిలో వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న చిన్నారులు



విరోచనాలతో పరిస్థితి విషమంగా ఉన్న హర్షిత్



వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న చిన్నారితో..

ముంచంగిపుట్టు: మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ సరియాపల్లిలో 20 మంది అస్వస్థతకు గురయ్యారు. చిన్నా,పెద్ద అనే తేడా లేకుండా చాలా మంది వాంతులు,విరోచనాలతో బాధపడుతున్నారు. వాంతులు, విరోచనాలతో ఒకే రోజు ఇద్దరు మృతి చెందడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన గోల్లోరి దనియా(56), సాయంత్రం ఏడాది బాలుడు కిలో వినయ్ వాంతులు,విరోచనాలతో మృతి చెందారు. ప్రస్తుతం గ్రామంలో కొర్రా విక్రత్,కొర్రా హర్షిత్,వంతాల సిద్ధాంత్,కొర్రా వసంత అనే ఏడాదిలోపు చిన్నారులతో పాటు మరికొంత మంది వాంతులు,విరోచనాలతో బాధపడుతున్నారు. చాలా మంది 10 రోజులుగా అస్వస్థతతో బాధపడుతున్నారు. ఇటీవల కిలగాడ వైద్య సిబ్బంది గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి, వైద్య సేవలు అందించినా అదుపులోకి రాకపోవడంతో గ్రామస్తులకు కంటిమీదకునుకు కరువైంది. తక్షణమే వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని బంగారుమెట్ట సర్పంచ్ రత్న,వైఎస్సార్‌సీపీ మండల నేత మోహన్,సరియాపల్లి గ్రామస్తులు కోరారు.దీనిపై కిలగాడ వైద్యాధికారి రమేష్ వద్ద ప్రస్తావించగా సరియాపల్లిలో గత వారం వైద్య శిబిరం నిర్వహించామని, బుధవారం మరోసారి శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. అవసరమైతే పీహెచ్‌సీకి తీసుకువచ్చి వైద్య సేవలు అందిస్తామని ఆయన చెప్పారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం ఖూనీ

- కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ



చలో తుని కార్యక్రమంలో కాకినాడ మాజీ ఎంపీ వంగా గీత తదితరులతో వీసం రామకృష్ణ

నక్కపల్లి: కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆరోపించారు. మంగళవారం ఆయన పలువురు కార్యకర్తలతో కలసి మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఇచ్చిన పిలుపు మేరకు చలో తుని కార్యక్రమానికి వెళ్లారు. తుని మున్సిపల్ కౌన్సిలర్లకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వీసం మాట్లాడుతూ గతంలో జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ప్రజలు ఘోరంగా ఓడించారన్నారు. స్థానిక ఎన్నికల్లో చీత్కరించినప్పటికీ సిగ్గురాలేదన్నారు. నాలుగేళ్ల అనంతరం అధికారం ఉంది కదా అని, తగినంత సంఖ్యాబలం లేకపోయినప్పటికీ కార్పొరేషన్‌లో మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకునేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు. తుని మున్సిపాలిటీలో ఒక్క కౌన్సిలర్ కూడా టీడీపీ నుంచి గెలవలేదన్నారు. ఇప్పుడు అధికారం ఉంది కదా అని, కొంతమంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకుని వైస్ చైర్మన్ పదవిని దక్కించుకోవాలని కుట్రలకు తెరలేపిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ కూటమి ప్రభుత్వం నీతులు చెబుతోందన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహించడం లేదన్నారు. కూటమి ప్రభుత్వానికి దమ్ముంటే వచ్చే ఏడాది జరిగే స్థానిక ఎన్నికల్లో సత్తా చూపి పదవులు దక్కించుకోవాలని హితువు పలికారు.

కల్చరల్ వర్క్‌షాప్‌లో జె.నాయుడుపాలెం ఉపాధ్యాయిని

- బోధనలో సంస్కృతీ సంప్రదాయాలను జోడించేలా శిక్షణ



సీసీఆర్టీ డైరెక్టర్ రాజీవ్‌జైన్ నుంచి శిక్షణా ధ్రువపత్రాన్ని అదుకుంటున్న ఆంగ్ల టీచర్ ప్రవీణ

రోలుగుంట: మండలంలోని జె.నాయుడుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయిని కె.వి.ఎల్.ప్రవీణ కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్‌లో నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ జరిగింది. ఇందుకు రాష్ట్రం నుంచి ఎంపికైన ఇద్దరిలో ప్రవీణ ఒకరు. ఈమె ఈ నెల 11న వెళ్లి అయిదు రోజులపాటు శిక్షణ పొందారు. శిక్షణానంతరం సీసీఆర్టీ డైరెక్టర్ రాజీవ్ జైన్ నుంచి ధ్రువపత్రాన్ని అందుకున్నారు. విజయవంతంగా శిక్షణ ముగించుకున్న ఆమెను హెచ్ఎం దాడిశెట్టి రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు పాఠశాలలో మంగళవారం అభినందించారు. ఆమె మాట్లాడుతూ బోధనలో భారతీయ సాంస్కృతిక సంప్రదాయాలను జోడించాలని సీసీఆర్టీ డైరెక్టర్ రాజీవ్ జైన్, డిప్యూటీ డైరెక్టర్ సందీప్ శర్మ సూచించారన్నారు.

అంతర్జాతీయ ఓపెన్ కరాటే పోటీల్లో బంగారు పతకాలు

- 9వ తరగతి విద్యార్థి రిషిసాయి ప్రతిభ



సినీ నటుడు సుమన్ నుంచి బంగారుపతకం అందుకుంటున్న రిషిసాయి

మునగపాక: కృషి, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని నిరూపించాడు మండలంలోని మెలిపాకకు చెందిన రిషిసాయి. 9వ తరగతి చదువుతున్న రిషిసాయి అంతర్జాతీయ ఓపెన్ కరాటే పోటీల్లో పాల్గొని రెండు బంగారు పతకాలతో పాటు బ్లాక్ బెల్ట్ సాధించాడు. సినీ నటుడు సుమన్ నుంచి మెడల్ అందుకున్నాడు. మండలంలోని మెలిపాకకు చెందిన కొత్తపల్లి ఉమాశంకర్-రాణి దంపతుల కుమారుడు రిషిసాయి విశాఖలోని భావన విద్యా నికేతన్‌లో 9వ తరగతి చదువుకుంటున్నాడు. చదువులో రాణించడంతో పాటు కరాటేలో శిక్షణ పొందుతున్నాడు. విశాఖ స్పోర్ట్స్ స్టేడియంలో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొని తన ప్రతిభ చాటాడు. రెండు బంగారు పతకాలతో పాటు బ్లాక్ బెల్ట్‌ను సైతం సొంతం చేసుకున్నాడు. కోచ్ ఎస్పీ ఎండీ నాయుడు వద్ద రిషిసాయి కరాటేలో శిక్షణ పొందుతున్నాడు. గ్రామీణ ప్రాంత బాలుడు పతకాలు, బ్లాక్ బెల్ట్ సొంతం చేసుకోవడం పట్ల కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రంగురాళ్లు తవ్వుతున్న 10 మంది అరెస్ట్





నిందితులతో పెదవలస రేంజ్ అధికారి శివరంజని, స్వాధీనం చేసుకున్న రంగురాళ్లు

చింతపల్లి (అల్లూరి జిల్లా): చింతపల్లి అటవీశాఖ సబ్ డివిజన్ పరిధిలో గల సిగనాపల్లిలో అక్రమంగా రంగురాళ్లు తవ్వుతున్న 10 మందిని అరెస్టు చేసినట్టు పెదవలస రేంజ్ అధికారి శివరంజని తెలిపారు. జీకే వీధి మండలం సంకాడ పంచాయతీ పరిధిలో గల సిగనాపల్లి సమీపంలో కొండపై రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు మంగళవారం సిబ్బందితో దాడి చేసినట్టు చెప్పారు. రంగురాళ్లు తవ్వుతున్న కాకినాడ జిల్లా పత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామానికి చెందిన 10 మందిని అరెస్టు చేసి, వారి నుంచి 2.2 గ్రాముల రంగురాళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. రంగురాళ్ల క్వారీ వద్ద విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ప్రొడక్షన్ వాచర్లను విధుల నుంచి తొలగించినట్టు రేంజ్ అధికారి శివరంజని తెలిపారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్ గోపి, స్ట్రైకింగ్ ఫోర్స్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.


రాష్ట్ర పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక




క్రీడా ప్రముఖులతో ఎంపికైన క్రీడాకారుల జట్టు

ఎంవీపీకాలనీ: జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపికైంది. ఈ మేరకు విశాఖ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జేఎస్వీ ప్రసాదరెడ్డి తెలిపారు. గత కొన్ని రోజులుగా 19 మంది క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ అందించగా సెలక్షన్ కమిటీ సభ్యులు మంగళవారం 12 మందితో కూడిన తుదిజట్టును ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఎంపికైన రాష్ట్ర కబడ్డీ పురుషుల జట్టు ఒడిశాలోని కటక్ వేదికగా జరగనున్న 71వ జాతీయ కబడ్డీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకు కటక్‌లో ఈ పోటీలు జరగనున్నట్లు తెలిపారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా కబడ్డీ నేషనల్ మెడలిస్ట్, విశాఖ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ప్రసాదరెడ్డి, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు సీహెచ్ పద్మరాజు, వైవీ శ్రీనివాస్‌లు వ్యవహరించారు. ఎంపికైన రాష్ట్ర జట్టును జి.రామకృష్ణ చౌదరి, లాలం రమేష్, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వై.శ్రీకాంత్, సీనియర్ జాతీయ క్రీడాకారుడు వీవీ రమణ, సీహెచ్ పద్మరాజు తదితర క్రీడా ప్రముఖులు అభినందించారు.

ట్రాలర్ ఢీకొని యువకుడి దుర్మరణం





గాయాలపాలైన మనోహర్ , మనోహర్ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడిని ట్రాలర్ రూపంలో మృత్యువు కబళించింది. షీలానగర్ పెట్రోల్ బంక్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వెంకయ్యపాలేనికి చెందిన మైలపల్లి మనోహర్ (24) మెరినో సంస్థలో సేల్స్ విభాగంలో పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా మంగళవారం నగరం నుంచి గాజువాక వైపు బైక్‌పై వెళ్తున్నాడు. షీలానగర్ పెట్రోల్ బంక్ దాటిన తర్వాత వెనుకనే వేగంగా వస్తున్న ట్రాలర్ బైక్‌ను ఢీకొట్టింది. బైక్ అదుపు తప్పడంతో మనోహర్ తూలి లారీ చక్రాల కిందకు వెళ్లిపోయాడు. ఆ సమయంలో మనోహర్ హెల్మెట్ ధరించినా.. లారీ చక్రాల కింద నలిగి హెల్మెట్ ఊడిపోయింది. తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని.. క్షతగాత్రుడిని షీలానగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యంలోనే మనోహర్ మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కోటేశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మనోహర్‌కు తండ్రి మైలపల్లి దేముడు, తల్లి దేముడమ్మ, ఒక సోదరి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

సఖి వన్ స్టాప్ సెంటర్ పరిశీలన



వన్ స్టాప్ సెంటర్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్జేడీ చిన్మయిదేవి

అనకాపల్లి టౌన్: అతివలకు అండగా సఖి వన్ స్టాప్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా ఆర్జేడీ చిన్మయిదేవి తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి ఎదురుగా ఏర్పాటు చేసిన సఖి వన్ స్టాప్ సెంటర్, శిశు సంక్షేమ శాఖ కార్యాలయాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు, మౌలిక వసతులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కె.అనంతలక్ష్మి, వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఎంపీ మంజులావాణి, నోడల్ ఆఫీసర్ ఎల్.సుజాత, ఏసీడీపీవో శశికళ, సీనియర్ అసిస్టెంట్ మోహినుద్దీన్, లైజనింగ్ అధికారి జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న లారీ సీజ్



రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద గ్రావెల్ లారీ

అనకాపల్లి: వేట జంగాలపాలెం గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్‌ను తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్టు రూరల్ ఎస్‌ఐ రవికుమార్ మంగళవారం రాత్రి తెలిపారు. లారీని అనకాపల్లి మైనింగ్ అధికారులకు అప్పగించామన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

అనకాపల్లి టౌన్: అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ వై.ఎల్.నాయుడు తెలిపారు. పిసినికాడ గ్రామం మరిడిమాంబ ఆలయం సమీపంలో మద్యం విక్రయిస్తున్న ఏడురి నాయుడిని అరెస్ట్ చేసి, 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

నేడు రామాలయ వార్షికోత్సవం

కశింకోట: పరవాడపాలెంలో బుధవారం రామాలయ వార్షికోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 6,929 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,660	4,400
రెండో రకం	3,190	3,750
మూడోరకం	3,000	3,180

అనకాపల్లి సినిమాలు

ఇట్స్ కాంప్లికేటెడ్ : రాజా
ఆరెంజ్ : సత్యనారాయణ స్క్రీన్-1(ఉదయం)
పుష్ప-2 : సత్యనారాయణ స్క్రీన్-1 (మ్యాట్నీ, 1,2 షోలు)
కెప్టెన్ అమెరికా తెలుగు వెర్షన్: సత్యనారాయణ స్క్రీన్-2
తండేల్ : పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం : షిర్డీసాయి
సూర్య కృష్ణన్ :వెంకటేశ్వర(ఉదయం)
తల :వెంకటేశ్వర (మ్యాట్నీ, 1,2 షోలు)
లైలా : శ్రీసత్య
బ్రహ్మానందం : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 35 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్ , బీ పాజిటివ్-7 యూనిట్లు, ఓ పాజిటివ్-24 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను 9703619706 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 383 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 341 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

శివారు కాలనీల్లో సమస్యల తిష్ట



అధ్వానంగా ఉన్న కాలి బాట



గురజాడ నగర్ రిక్షా కాలనీకి వెళ్లే రహదారి దుస్థితి

- సౌకర్యాల లేమితో ప్రజల అవస్థలు
- వేధిస్తున్న అధ్వాన రోడ్లు, విద్యుత్, మంచినీటి కొరత
- మౌలిక వసతుల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులు

తుమ్మపాల: మండలంలో పలు కాలనీలు ఏజెన్సీ పల్లెలను తలపిస్తున్నాయి. మౌలిక సౌకర్యాల లేమితో ఏళ్ల తరబడి కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో అష్టకష్టాలు పడి గూడు నిర్మించుకున్నప్పటికి వాటికి తగ్గ సౌకర్యాలు లేక వదిలిపోవాల్సిన దుస్థితి నెలకొంది. రెక్కాడితే గాని డొక్కాడని అనకాపల్లి పట్టణ పేదలకు గత ప్రభుత్వాలు సమీపంలోని పల్లెల్లోని కొండ ప్రాంతాల్లో కొన్నేళ్ల క్రితం స్థలాలు మంజూరు చేశాయి. దీంతో ఒక్కొక్కరుగా ఆయా స్థలాల్లో సొంత గూడు నిర్మించుకుని పనుల నిమిత్తం పట్టణానికి వెళ్తొస్తూ జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. ఇలా వీరంతా గ్రామాల్లో పాలకులు, అధికారుల దృష్టిలో ఇప్పటికి వలస జీవులుగానే ఉండిపోయారు. అందుకే ఈ కాలనీల్లో మౌలిక సౌకర్యాలు కల్పించే ఆలోచనే చేయడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మండలంలో పట్టణానికి చెందిన నిరుపేదలు బట్లపూడి, కొప్పాక, గొలగాం, తారకరామ కాలనీ, మారేడుపూడి, తుమ్మపాల, పిసినికాడ, మామిడి పాలెం, బవులువాడ, తదితర గ్రామాల్లో మంజూరైన స్థలాల్లో ఇళ్లు కట్టుకున్నారు. అయితే ఆయా కాలనీల్లో వసతులు కరువయ్యాయి. రోడ్లు, కాలువలు లేవు. గుక్కెడు నీటి కోసం ఎన్నో ప్రయాసలు పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. విద్యుత్ స్తంభాలు లేక లేక రాత్రి అయితే అంధకారం రాజ్యమేలుతోంది. చుట్టూ ఉన్న తుప్పల్లోంచి ఎప్పుడు ఏ విష కీటకం ఇళ్లలోకి ప్రవేశిస్తోందనన్న భయాందోళనతో ఆయా కాలనీ వాసులు జీవనం సాగిస్తున్నారు. మరోవైపు పేదరికంతో కొందరు స్థలాలను విక్రయించడంతో నేటికీ ఆ స్థలాలు ఖాళీగానే ఉన్నాయి. అరకొర నిర్మాణాలకు సౌకర్యాలు కల్పించడం కష్టమంటూ అధికారులు కూడా ఈ కాలనీల వైపు కన్నెత్తి చూడడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

తాగునీరు కొనుక్కోవాల్సిందే..

ఆయా గ్రామాల్లోని ఇలాంటి కాలనీల్లో నివాసముంటున్న వారంతా ప్రైవేటు ప్లాంట్ల నుంచి రోజూ తాగు నీటిని కొనుక్కోవాల్సిందే. విద్యుత్ సౌకర్యం లేదు. రాత్రి సమయాల్లో ఈ కాలనీలకు రాకపోకలు చేయడం పెద్ద సాహసంగా మారింది. కాలనీల చుట్టూ తుప్పలు పెరిగిపోవడంతో అడవిని తలపిస్తున్నాయి.

గుక్కెడు నీటి కోసం అవస్థలు

పలు కాలనీలో తాగునీటి కుళాయిలు లేవు. నీటి కోసం అర కిలోమీటరు దూరం వెళ్లి బిందెలు, డబ్బాలతో చేతిబోర్ల నుంచి తెచ్చుకోవలసిందే. కొన్ని సార్లు డ్రమ్ములతో నీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. ఎండా కాలం వస్తుంది. తాగునీటికి నానా అవస్థలు పడాల్సి వస్తుంది. ఇంటింటి కుళాయి పథకం ద్వారా శివారు కాలనీలకు మంచినీటి సదుపాయం కల్పించాలి.

– కొణతాల హరినాథ్‌బాబు, అనకాపల్లి



విద్యుత్ స్తంభానికి రూ.50 వేలు చొప్పన కట్టాలట..



ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో కూలి డబ్బులు దాచుకుని వ్యయ ప్రయాసలతో ఇల్లు కట్టుకున్నాం. విద్యుత్ సౌకర్యం, మంచి నీరు సదుపాయం ఇప్పటికీ కల్పించ లేదు. దీంతో కుటుంబంతో ఇక్కడ ఉండలేక మరో చోట నివాసం ఉంటున్నాం. విద్యుత్ సౌకర్యం కోసం ఆ శాఖ సిబ్బందిని అడిగితే ఒక్కో స్తంభానికి రూ.50 వేలు అంచనాతో బిల్లు ఇచ్చారు. కాలనీ వాసులు చందాలు వేసుకుని కడదామని సిద్ధమయ్యాయి. దూరం కారణంగా కాలనీకి రెండు స్తంభాలు వేయాలని, రెండింటికి కలిపి మొత్తం రూ. లక్ష చెల్లించాలంటున్నారు.

– ఎస్.రాజు, గురజాడ నగర్, రిక్షా కాలనీ

హైస్కూల్‌లో ఖోఖో కోర్టు నిర్మాణం



కశింకోట బాలికల హైస్కూల్‌లో ఖోఖో కోర్టు నిర్మాణ పనులు

కశింకోట: స్థానిక బాలికల హైస్కూల్‌లో ఖోఖో కోర్టు నిర్మాణం చేపట్టారు. పీఎంశ్రీ కింద రూ.4.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. వీటిలో రూ.2.50 లక్షలతో ఖోఖో ఆడటానికి అవసరమైన కోర్టు నిర్మాణం చేపట్టారు. పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును ఏర్పాటు చేశారు. కబడ్డీ కోర్టును కూడా నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. రూ.50 వేలతో తరగతి గదుల్లోకి దివ్యాంగ విద్యార్థుల రాకపోకలకు అనువుగా ర్యాంపు నిర్మాణం చేపట్టారు. పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని హెచ్ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, స్కూల్ నిర్వహణ కమిటీ చైర్మన్ ఆళ్ల శ్రీనివాసరావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: విద్యుత్ శాఖ డీ–1 సెక్షన్ పరిధి 11కేవీ లక్ష్మీనారాయణ ఫీడర్‌లో బుధవారం విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. పెరుగుబజార్ జంక్షన్, మసీదు వీధి, నెయ్యిల వీధి, కోట్నివీధి, చిన్నవీధి, రెల్లివీధి, తాకాశివీధిలో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్ శాఖ ఉద్యోగులకు సహకరించాలని కోరారు.

దశల వారీగా గ్రామాల్లో వైద్య శిబిరాలు



మామిడిపాలెంలో రోగులతో మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్‌వో రవికుమార్

అనకాపల్లి: దశల వారీగా గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్టు డీఎం అండ్ హెచ్‌వో పి.రవికుమార్ తెలిపారు. మండలంలో మామిడిపాలెం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడే అవకాశాలు ఉన్నాయని, పరిశుభ్రమైన వాతావరణంలో జీవించేందుకు కృషి చేయాలని కోరారు. నాలుగు రోజుల పాటు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. మొదటి రోజు 68 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఓ వ్యక్తిని మెరుగైన వైద్యం కోసం ఎన్టీఆర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో తగరంపూడి వైద్యాలు పావని, వైద్యులు పి.సన్యాసిరావు, కె.సంతోష్ కుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరిడిమాంబ జాతర రేపు



అమ్మవారిని దర్శించుకుంటున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: స్థానిక విజయరామరాజుపేటలో మరిడిమాంబ అమ్మవారిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాన్ని ఈ నెల 20న వైభవంగా నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు-2 వేగి త్రినాథ్, పట్టణ కార్యదర్శి కుండల రామకృష్ణ, ఆలయ చైర్మన్ సత్యనారాయణ, కమిటీ సభ్యులు పలకా రాము, పలకా సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను, బొట్టా చిన్నియాదవ్, పసుపులేటి అప్పారావు, బొబ్బిలి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణాలకు భద్రం



నక్కపల్లి నుంచి హెల్మెట్‌లు ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, వాహనచోదకులు

- నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు
- నక్కపల్లిలో ఉత్సాహంగా పోలీసుల ర్యాలీ

నక్కపల్లి: ద్విచక్ర వాహనాలు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం నక్కపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సుమారు 100 మోటారు సైకిళ్లపై హెల్మెట్ ధరించి నక్కపల్లి నుంచి అడ్డురోడ్డు, అక్కడి నుంచి వెదుళ్లపాలెం వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వల్లే ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రమాద సమయంలో తలకు బలమైన గాయం తగలకుండా హెల్మెట్ రక్షణ కల్పిస్తుందన్నారు. రోడ్లపై జరిగే ద్విచక్ర వాహన ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడం వల్ల తలకు గాయాలై ప్రాణాలు కోల్పోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. మితిమీరిన వేగంతో బైక్‌లు నడపడం కూడా ప్రమాదాలకు కారణమని డీఎస్పీ చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం, పోలీసు, రవాణా శాఖ ఎన్ని కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రజల నుంచి సహకారం, బాధ్యత లేకపోతే ప్రమాదాల నివారణ సాధ్యం కాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఆటోలు, మోటారు సైకిళ్లు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతీయకూడదన్న ఉద్దేశంతో నామమాత్రపు జరిమానా విధించి విడిచిపెడుతున్నామని, కఠినంగా ఉంటే ఆటోలు నడిపే అవకాశం ఉండదని హెచ్చరించారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. వరుసగా ప్రమాదాలకు కారణమవుతున్న వాహనచోదకులు, ఆటో డ్రైవర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ ర్యాలీలో సీఐ కుమారస్వామి, ఎస్‌ఐ సన్నిబాబు, పలువురు ద్విచక్ర వాహన చోదకులు పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

వైభవంగా నల్లమారమ్మ జాతర



రామాపురంలో నల్లమారమ్మతల్లిని దర్శించుకుంటున్న మలసాల భరత్‌కుమార్



రామాపురం గ్రామంలో అమ్మవారి చెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

అనకాపల్లి: మండలంలో కొత్తూరు పంచాయతీ రామాపురం, పిసినికాడ పంచాయతీ బీఆర్టీ కాలనీలో నల్లమారమ్మతల్లి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మవార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కూడా అమ్మవార్లను దర్శించున్నారు. అనంతరం కమిటీ సభ్యులు భరత్‌కుమార్‌ను శాలువాలతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాలను అందజేశారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు, స్టేజ్ ప్రోగ్రాంలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ పర్సన్ భీశెట్టి వరహ సత్యవతి, ఎంపీటీసీ మొల్లేటి శివాజీ హైమ, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పార్టీ కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు మలసాల కుమార్‌రాజా, నల్లపు వెంటరావు, పెదిశెట్టి రమేష్, నీలకంఠ లక్ష్మి, నరేంద్ర, ఆడారి సత్తిబాబు, ప్రకాష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



కుంచంగిలో కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుంటున్న భరత్‌కుమార్

కుంచంగి గ్రామంలో...

మండలంలో కుంచంగి గ్రామంలో కనకదుర్గాదేవి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం జరిగింది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అమ్మవారిని దర్శించుకునిప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కుంచంగి సర్పంచ్ పల్లెల నాగలక్ష్మి నాగేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ నడిపల్లి దేవరాయులు, పార్టీ నాయకులు మరిపల్లి శోభ, కర్రి గోవింద్, పల్లెల సాయికిరణ్, డెక్కల సురేష్, నాగులాపల్లి దినేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్ కోరారు. మండలంలోని మంగళవారం కొప్పాక, సీతానగరం, కొండుపాలెం, దిబ్బపాలెం, కూండ్రం, తుమ్మపాల, గ్రామాల్లోని హైస్కూళ్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి రఘువర్మను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సత్యం మాస్టారు, సాంబ మూర్తి రాజు, రసూల్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ వర్తింపునకు వినతి

అనకాపల్లి టౌన్: తెలుపు రంగు రేషన్ కార్డుతో సంబంధం లేకుండా వృద్ధులందరికీ ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేయాలని జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు కోరారు. ఈ మేరకు స్థానిక కొణతాల క్యాంప్ ఆఫీస్‌లో మంగళవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కలిసి వయోవృద్ధుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో 9 శాతంగా ఉన్న వృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. వృద్ధాప్య పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచాలని, వృద్ధులకు సేవ చేసే స్వచ్ఛంద సంస్థలకు రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు.

దివ్యాంగుడికి సాయం

కశింకోట: నూతలగుంటపాలెం శివారు త్రిపురవానిపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగుడు పిల్లిబోయిన రాముకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని పల్లపు సోమవరం మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు మంగళవారం అందజేశారు. ఎంపీ సీఎం రమేష్ జన్మదినోత్సవం సందర్భంగా ఈ సహాయాన్ని అందించినట్లు ఆయన తెలిపారు.

లలితా ఫెర్రో పరిశ్రమను యథావిధిగా నడపాలి

అచ్యుతాపురం రూరల్: రాజరాజేశ్వరి లలిత త్రిపుర సుందరి పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు రెండు నెలల బకాయిలు వెంటనే చెల్లించి, యథావిధిగా పరిశ్రమను నడపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. మంగళవారం పరిశ్రమ కార్మికులతో మాట్లాడి విషయం తెలుసుకుని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల బకాయిలు ఉన్నాయని సరఫరా నిలిపివేయడంతో ఉత్పత్తి ఆగిపోయిందన్నారు. అప్పటి నుంచి ప్రతి రోజూ కంపెనీని ఎప్పుడు తెరుస్తారా? తమకు జీతాలు ఇస్తారా? కార్మికులు ఆశతో ఎదురుచూస్తున్నారన్నారు. సోమవారం కార్మికులను కంపెనీకి రావద్దని చెప్పడంతో అంతా ఆందోళనలకు గురయ్యారని చెప్పారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఇలా నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు.

మందులతో క్షయ వ్యాధి నివారణ సాధ్యమే

అనకాపల్లి టౌన్: క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ వ్యాధి నివారణ సాధ్యమేనని జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ ఎం.ఎస్.వి. కె.బాలాజీ తెలిపారు. స్థానిక గవరపాలెం ఉన్నత పాఠశాలలో జాతీయ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం పూట జ్వరం, బరువు తగ్గిపోవడం, ఆకలి మందగించడం, దగ్గులో కఫం పడడం, తదితర లక్షణాలు ఉన్న వారు వెంటనే డాక్టర్‌ను సంప్రదించి తగు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, డాక్టర్ శ్రావణి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి వివరాలు తెలిస్తే సంప్రదించండి

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని 40 ఏళ్ల వ్యక్తి ఆచూకీ లభ్యం కాలేదని ఎస్‌ఐ కె.లక్ష్మణరావు మంగళవారం తెలిపారు. గత ఆదివారం రాత్రి వ్యాన్ ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంగతి తెలిసిందే. కుటుంబ సభ్యులు, బంధువుల కోసం అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రి మార్చ్యూరీ గదిలో మృతదేహాన్ని భద్రపరిచామన్నారు. మృతుడి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

బస్సు సర్వీసు పునరుద్ధరణకు వినతి

మునగపాక: విశాఖ కలెక్టరేట్ నుంచి అచ్యుతాపురం వరకు బస్సు సదుపాయం కల్పించాలని కోరుతూ మునగపాక మండలం పాటిపల్లికి చెందిన బాపూజీ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు మొల్లేటి భోగేశ్వరరావు మంగళవారం జిల్లా ప్రజా రవాణాధికారి అప్పలనాయుడుకు వినతిపత్రం అందజేశారు. 15 సంవత్సరాల క్రితం 77బీ బస్సు మునగపాక మండలంలో పలు గ్రామాల మీదుగా రాకపోకలు సాగించేదన్నారు. గాజువాక, తానాం, వెంకటాపురం, సిరసపల్లి, మునగపాక మీదుగా అచ్యుతాపురం వరకు బస్సు సదుపాయం కల్పించాలని కోరారు.



జిల్లా ప్రజా రవాణాధికారి అప్పలనాయుడుకు వినతిపత్రం అందిస్తున్న భోగేశ్వరరావు